



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
4PM
www.suryaa.com పేజీలు: 02

బంగారం ధర ₹63,870 10 GRMS 22 CARAT
వెండి ధర 1KG 80,000
సెన్సెక్స్ 72,240 (170)
నిఫ్టి 21,731 (47)
చికెన్ ధర 1KG ₹160
గుడ్ల ధరలు డజన్ ₹68



## అయోధ్యలో మోదీ.. అమృత్ భారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని మోదీ

ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా అయోధ్యలో ఆధునిక హంగులు, రామమందిర చిత్రాలతో పునరుద్ధరించిన అయోధ్య రైల్వేస్టేషన్‌ను ప్రధాని ప్రారంభించారు. ఆయన వెంట యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తదితరులు ఉన్నారు. రైల్వే స్టేషన్ విశేషాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రధానికి వివరించారు.

**8 రైళ్లకు పచ్చజెండా..**

అనంతరం ప్రధాని మోదీ రెండు అమృత్ భారత్, ఆరు వందే భారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు అమృత్ భారత్ రైల్లోకి వెళ్లి విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. పర్యటనలో భాగంగా అయోధ్యలోని మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మోదీ ప్రారంభిస్తారు. ఆ కార్యక్రమం అనంతరం ఎయిర్‌పోర్టు పక్కనున్న మైదానంలో ఏర్పాటుచేసే 'జన్ సభ'లో ప్రసంగిస్తారు.

**అమృత్ భారత్ ఫీచర్లివే..**

అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ రైలు పుష్-పుల్ రైలు. ముందూ వెనుక ఇంజిన్లు ఉంటాయి. దీనివల్ల తక్కువ సమయంలోనే రైలు వేగాన్ని అందుకోవడంతోపాటు, ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఇందులో 22 కోచ్‌లు ఉంటాయి. 12 సెకండ్ క్లాస్ త్రీటైర్ స్లీపర్ కాగా.. 8 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు, రెండు గార్డు కంపార్ట్‌మెంట్స్ ఉంటాయి. ఈ 2 కంపార్ట్‌మెంట్లలోనే కొంత భాగాన్ని మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ రైళ్లు గరిష్ఠంగా 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి.

**15 కిలోమీటర్ల మెగా రోడ్ షో..**

ఈ ఉదయం అయోధ్య చేరుకున్న ప్రధానికి రాష్ట్ర గవర్నర్ ఆనందిబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి ఆయన రోడ్ షోలో పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ వరకు 15 కిలోమీటర్ల మేర జరిగిన ఈ రోడ్ షోలో దారి పొడవునా ప్రధానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. మధ్య మధ్యలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,400 మంది కళాకారులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.



## రెండో స్థానంలో ద్రోణవల్లి హారిక

ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో తొమ్మిదో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఏడు పాయింట్లతో మరో నలుగురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచింది. హారిక ఆరు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని... ఒక గేమ్‌లో ఓడిపోయింది. నేడు మిగతా ఎనిమిది రౌండ్ గేమ్‌లు జరుగుతాయి. భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్ 6 పాయింట్లతో 13వ ర్యాంక్‌లో, 6 పాయింట్లతో నూతక్కి ప్రియాంక 24వ ర్యాంక్‌లో... రక్షిత, కోనేరు హంపి 5.5 పాయింట్లతో వరుసగా 28వ, 31వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. ఓపెన్ విభాగంలో 11 రౌండ్ల తర్వాత భారత గ్రాండ్ మాస్టర్లు నిహాల్ సరీన్, ఇరిగేశి అర్జున్ 8.5 పాయింట్లతో మరో ఐదుగురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నారు. నేడు మిగతా పది రౌండ్లు జరుగుతాయి.

## తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం

రవాణా శాఖలో ఆన్ డ్యూటీ(OD)లను రద్దు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎంవీఐ, ఏఎంవీఐ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల ఓడీలను ప్రభుత్వం రద్దు చేసింది. కాగా, తెలంగాణ రవాణా శాఖలో ముగ్గురు జేటీసీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ జేటీసీగా ఉన్న పాండురంగ నాయక్ అడ్మిన్‌గా బదిలీ అవ్వగా, హైదరాబాద్ జేటీసీ అడ్మిన్‌గా ఉన్న మమతా ప్రసాద్‌ను ఐటీ అండ్ వీఐజీకి బదిలీ అయ్యారు. హైదరాబాద్ జేటీసీ ఐటీ అండ్ వీఐజీగా ఉన్న రమేష్‌ను హైదరాబాద్ జేటీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



# కదంతొక్కిన అంగన్వాడీలు.. మంత్రుల ఇళ్ల వద్ద ఉద్రిక్తత!

తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె శనివారం 19వ రోజుకు చేరుకుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్యకర్తలు నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇవాళ పలు చోట్ల మంత్రుల ఇంటి ముట్టడికి యత్నించారు. గుంటూరులోని శ్యామలనగర్‌లో మంత్రి విడదల రజిని ఇంటిని అంగన్వాడీలు ముట్టడించారు. దాదాపు నాలుగు నియోజకవర్గాల నుంచి అంగన్వాడీలు తరలివచ్చారు. ప్రభుత్వం స్పందించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమకు కనీస వేతనాలు పెంచి గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అంగన్వాడీల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా మంత్రి రజని తెలిపారు. అంగన్వాడీలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అందరి సమస్యలను పరిష్కరిస్తుందని చెప్పారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో మంత్రి సురేష్ ఇంటిని సైతం అంగన్వాడీలు ముట్టడించారు. మంత్రి సురేష్ ఇంటి ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అంగన్వాడీల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. అలాగే ఒంగోలులోని మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయాన్ని దిగ్బంధించారు. మంత్రి ఉష శ్రీచరణ్ ఇంటి ముట్టడికి కూడా అంగన్వాడీలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వెళుతున్న అంగన్వాడీలను నాలుగో పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. శివారు ప్రాంతంలో వాహనాలను నిలిపి అంగన్వాడీలను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. దీంతో అంగన్వాడీలు స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి ఇంటి ముట్టడికి బయల్దేరిన అంగన్వాడీలను వెస్ట్ చర్చి కూడలి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపైనే బైఠాయించి నినాదాలు చేశారు. ఈ క్రమంలో రాకపోకలను పోలీసులు దారిమళ్లించారు. విజయనగరంలో మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి ముట్టడికి అంగన్వాడీలు యత్నించారు

## ఎన్డీయే నుంచి వైదొలగనున్న నితీశ్ కుమార్..



లలన్ సింగ్ స్థానంలో తానే జాతీయ అధ్యక్షుడిగా నితీష్ కుమార్ తీసుకున్న నిర్ణయంపై జోరుగా చర్చ సాగుతోంది. నితీష్ కుమార్ మళ్లీ బీజేపీ వైపు వెళ్లనున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, శుక్రవారం జరిగిన జనతాదళ్ (యునైటెడ్) జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను బట్టి, ప్రస్తుతం ఆయన ఎన్డీయేలో చేరే ఆలోచనలో లేనట్లు తెలుస్తోంది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ భారత కూటమి నుంచి ప్రధాని అభ్యర్థిగా లేదా కూటమి కన్వీనర్‌గా మారేందుకు ఆసక్తి చూపడం లేదని జేడీయూ తన ప్రతిపాదనలో పేర్కొంది. బీజేపీతో తెగతెంపులు చేసుకుని 2022లో ఎన్డీయే నుంచి వైదొలగాలన్న నితీశ్ కుమార్ నిర్ణయానికి కూడా ఈ తీర్మానం మద్దతునిస్తోంది. పాట్నాలో ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తెచ్చినందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ని పార్టీ అభినందించింది.




## గ్యాంగ్‌స్టర్ లఖ్బీర్ సింగ్ ఉగ్రవాదే.. హోంశాఖ ప్రకటన

ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు, తీవ్రవాద కార్యకలాపాలను అడ్డుకునేందుకు పలు చర్యలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. కెనడాలో ఆశ్రయం పొందుతున్న గ్యాంగ్‌స్టర్ లఖ్బీర్ సింగ్ లండాను ఉగ్రవాదిగా ప్రకటించింది. పలు ఉగ్రదాడులు, దోపిడీలు, హత్యల్లో అతడి ప్రమేయం ఉన్నందున ఉపా చట్టం కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 33 ఏళ్ల లఖ్బీర్ సింగ్ స్వస్థలం పంజాబ్‌లోని తరన్ తరన్ జిల్లా. 2022లో మొహాలీలోని పోలీసు ఇంటెలిజెన్స్ హెడ్‌క్వార్టర్స్‌పై జరిగిన రాకెట్ ఆధారిత గ్రనేడ్ దాడికి ఇతడే కుట్రదారి. దీంతో పాటు శక్తిమంతమైన ఐఈడీల సరఫరా, అధునాతన ఆయుధాలు, పేలుడు పదార్థాల స్మగ్లింగ్ వంటి కార్యకలాపాల్లో ఇతడు చురుగ్గా వ్యవహరిస్తున్నట్లు హోంశాఖ తెలిపింది. పలు ఉగ్రదాడులు, దోపిడీలు, హత్యలు, ఐఈడీలు అమర్చడం, ఆయుధాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాతో పాటు పంజాబ్, దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉగ్రవాద చర్యలకు నిధులు సమకూర్చడం వంటి ఘటనలకు సంబంధించి లఖ్బీర్‌పై పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించింది.

## షర్మిల ఏ నిర్ణయం తీసుకున్నా.. ఆమె వెంటే ఉంటా

### ఆళ్ల రామకృష్ణారెడ్డి



షర్మిల కాంగ్రెస్‌కు వెళ్లేది నిజమే అయితే.. తానూ ఆమె వెంటే నడుస్తానని ఇటీవల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వెల్లడించారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "నేను ఏ పార్టీలో ఉంటాననేది కాలమే నిర్ణయిస్తుంది. వైకాపాకు నేను ఎంత సేవ చేశానో నాకు తెలుసు. నేను సర్వస్వం పోగొట్టుకున్నాను. ఇకపై వైఎస్ షర్మిల వెంట నడుస్తా. షర్మిలమ్మ ఏ నిర్ణయం తీసుకున్నా ఆమె వెంటే ఉంటా. వైకాపాకు సిద్ధాంతాలు ఉండాలి. మంగళగిరి ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు. రూ.1200 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పి రూ.120 కోట్లను మాత్రమే కేటాయించారు. నా సొంత డబ్బుతో నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు చేశా. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపించా. స్వయంగా నేనే రూ.8 కోట్ల వరకు బయట అప్పులు తెచ్చి కాంట్రాక్టర్లకు ఇచ్చాను. లోకేశ్‌ను ఓడించిన నాకు సహకారం అందించకపోతే ఎలా? నేను ఎవరినీ నిందించడం లేదు. నిధులు మంజూరు చేస్తానని నాకు ధనుంజయ రెడ్డి చాలా సార్లు సందేశాలు పెట్టారు. ఎన్నికలు దగ్గరకు వచ్చినా ఇంకెప్పుడు నిధులు మంజూరు చేస్తారు. రాజీనామా ఆమోదించకపోవడం అనేది వాళ్ల ఇష్టం. నేను స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా ఇచ్చా. ఎవరు గెలవాలని నిర్ణయించేది ప్రజలే. నేను ఏ పార్టీలో చేరినా అదే రోజే నిర్ణయం చెబుతా. గతంలో వైకాపాలోనే ఉంటానని చెప్పి ఇప్పుడు పార్టీని వీడాను. దీనికి సీఎం జగనే సమాధానం చెప్పాలి. చాలా మంది నన్ను ఇతర పార్టీల్లోకి రావాలని ఆహ్వానించారు. వైఎస్ కుటుంబంతోనే ఉన్నా.. ఉంటానని వారికి చెప్పా. చంద్రబాబుపై వేసిన కేసులపై న్యాయ పోరాటం చేస్తా. వైకాపా ప్రభుత్వం తప్పు చేస్తే వాటిపై కేసులు వేసేందుకు అయినా వెనకాడను. తప్పులు ఎవరు చేశారు అనేది న్యాయస్థానాలు తేలుస్తాయి. నేను లేకపోయినా మంగళగిరి అభివృద్ధి ఆగదు. నాకు జగన్ టికెట్ ఇవ్వలేదని నేను పార్టీని వీడలేదు. పొమ్మన లేక పొగపెట్టారు. నాకు, చిరంజీవికి, జగన్‌కు మధ్య ఏమి జరిగిందనేది మా అందరికీ తెలుసు" అని ఆళ్ల రామకృష్ణారెడ్డి వెల్లడించారు.




## ఒక్కరోజులో 797 కరోనా కేసులు

దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా జేఎన్.1 ఉప వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో మొత్తం 797 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ శుక్రవారం వెల్లడించింది. ఒకేరోజులో ఈ స్థాయిలో కేసులు నమోదు కావడం గత ఏడు నెలల్లో ఇదే మొదటిసారి. మొత్తం యాక్టివ్ కేసుల 4091కి చేరుకుంది. ఇప్పటివరకు జేఎన్.1 వేరియంట్ బారినపడిన బాధితుల సంఖ్య 162కు చేరింది. అత్యధికంగా కేరళలో 83 కేసులు, గుజరాత్‌లో 34 జేఎన్.1 కేసులు వెలుగుచూశాయి. గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీలో జేఎన్.1 ఉప వేరియంట్ కేసులు నమోదైనట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జినోమిక్స్ కన్సార్టియం(ఇన్సాకాగ్) శుక్రవారం తెలియజేసింది. ఇదిలా ఉండగా, గత 24 గంటల్లో కరోనా కాటుకు ఐదుగురు బలయ్యారు.



## తిరుమలలో మరోసారి చిరుత, ఎలుగుబంటి కదలికలు

తిరుమల అలిపిరి నడక మార్గంలో మరోసారి చిరుత, ఎలుగు బంటి సంచారం కలకలం రేపింది. చిన్నారి లక్షితపై చిరుత దాడి చేసి చంపిన ప్రాంతంలోనే.. ఈ నెల 13, 26 తేదీల్లో వీటి సంచారం కనిపించినట్లు అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తించారు. ఈ నేపథ్యంలో నడకమార్గంలో వచ్చే భక్తులను తితిదే హెచ్చరించింది. అప్రమత్తంగా, గుంపులు గుంపులుగా భక్తులు రావాలని సూచించింది.



## ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల జనరల్, ఒకేషనల్ విభాగాలకు అపరాధ రుసుముతో కలిపి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును జనవరి 3 వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. ఈ గడువులోగా విద్యార్థులు రూ.2500 అపరాధ రుసుముతో కలిపి ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఇంటర్ కోర్సుల్లో 10,59,233 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకోగా, ఇప్పటి దాకా 9,77,040 మంది ఫీజు చెల్లించారు.



## విశాఖలో చెత్తవాహనాలను అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు..

డిమాండ్ల సాధన కోసం పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. విశాఖలో రాత్రి దీక్షా శిబిరం వద్ద నిద్రపోయిన కార్మికులు.. శనివారం తెల్లవారుజాము నుంచే ఆందోళనకు దిగారు. కేఆర్ఎం కాలనీ జీవీఎంసీ చెత్తవాహనాల యార్డ్ వద్ద నిరసన చేపట్టారు. చెత్త వాహనాలు బయటకు రాకుండా అడ్డుకున్నారు. తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని నినాదాలు చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిన్న రాత్రి ఎంవీపీ కాలనీ యార్డ్ నుంచి తెచ్చి శివాజీ పార్క్‌లో ఉంచిన చెత్త సేకరణ వాహనాలను పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

## జార్ఖండ్‌లో 50 ఏళ్లకే పెన్షన్

పెన్షన్ల మంజూరు విషయంలో జార్ఖండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనులు, దళితులకు పెన్షన్ అర్హత వయసును 60 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు తగ్గించింది. 50 ఏళ్ల వయసు రాగానే పెన్షన్ ప్రయోజనాలు అందుకోవచ్చని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శుక్రవారం ప్రకటించారు. రాష్ట్రంలో జేఎంఎం కూటమి ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు, దళితుల్లో మరణాల రేటు అధికంగా ఉందని, 60 ఏళ్లు దాటాక వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించడం లేదన్నారు.

సూర్య నేటి దినపత్రిక www.suryaa.com EVENING EDITION 4PM




## 2024లో తొలి చంద్రగ్రహణం ఎప్పుడో తెలుసా?

మరో రెండు రోజుల్లో 2023కు ముగింపు పలికి 2024లోకి అడుగుపెట్ట బోతున్నాం. అయితే కొత్త సంవత్సరంలో తొలి చంద్రగ్రహణం మార్చి 25న (సోమవారం) ఏర్పడనుందని జ్యోతిషులు చెబుతున్నారు. చంద్రగ్రహణం ఉదయం 10:41 గంటలకు మొదలై.. మధ్యాహ్నం 3:01 గంటలకు ముగుస్తుందన్నారు. దాదాపు 4 గంటల పాటు చంద్రగ్రహణం ఉంటుందన్నారు. అయితే ఈ చంద్రగ్రహణం భారత్‌లో కనిపించదు. అమెరికా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా తదితర ప్రాంతంల్లో కనిపించనుంది.



## జనవరి 1 నాటికి 800 కోట్లకు ప్రపంచ జనాభా

ప్రపంచ జనాభా మరో మైలురాయిని చేరుకోనుంది. కొత్త ఏడాది ఆరంభానికల్లా ప్రపంచ జనాభా 800 కోట్ల మార్కుని దాటేస్తుందని అమెరికా జనగణన బ్యూరో వెల్లడించింది. ఈ సంస్థ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో.. 2023లో ప్రపంచ జనాభా 7.5 కోట్ల మేర పెరిగిందని, జనవరి 1 నాటికి ఇది 800 కోట్ల మార్కుని అధిగమిస్తుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా వృద్ధిరేటు కేవలం 1 శాతంలోపే ఉందని తెలిపింది. 2024 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకు సగటున 4.3 జననాలు, రెండు మరణాలు సంభవిస్తాయని అమెరికా సెన్సస్ బ్యూరో అంచనా వేసింది. గత సంవత్సర కాలంగా అమెరికా జనాభా వృద్ధిరేటు 0.53 శాతంగా ఉందని, ప్రపంచ వృద్ధిరేటుతో పోలిస్తే ఇది సగమేనని పేర్కొంది. ఈ ఏడాది అమెరికాలో 17.5 లక్షల జననాలు నమోదయ్యాయని తెలిపింది. 2024 జనవరి 1 నాటికి ఈ దేశ జనాభా 33.58 కోట్లకు చేరుకుంటుందని సెన్సస్ బ్యూరో అంచనా వేసింది. ప్రస్తుత వేగమే ఈ దశాబ్దం చివరి వరకూ కొనసాగితే.. అమెరికా చరిత్రలో అత్యంత నెమ్మదిగా పెరిగిన జనాభా దశాబ్దంగా నిలవనుందని పేర్కొంది. 2024 ప్రారంభంలో అమెరికాలో ప్రతి 9 సెకన్లకు ఒక జననం, ప్రతి 9.5 సెకన్లకు ఒక మరణం సంభవించే అవకాశం ఉందని తెలిపింది. అయితే వలసలు అమెరికాలో జనాభా తగ్గకుండా నిరోధిస్తున్నాయని పేర్కొంది. వలసల కారణంగా అమెరికాలో ప్రతి 28.3 సెకన్లకు ఒక వ్యక్తి జనాభాకు జత కలుస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి.



## పొగమంచులో ప్రయాణం.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

* దట్టమైన పొగమంచులో వాహనాలను నడిపేటప్పుడు కచ్చితంగా ఫాగ్‌లైట్లు వెలుగుతూనే ఉండాలి.
* తెల్లవారు జామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల కంటే వేగం దాటకుండా వాహనాలను నడపాలి.
* రోడ్డు పక్కన బండి నిలిపి ఉంచినప్పుడు హెడ్‌లైట్‌లతో పాటు, వెనుక లైట్లు కూడా వెలుగుతూ ఉండాలి.
* వాహనం చుట్టూ రేడియం టేప్ తప్పనిసరి.
* రాత్రి వేళల్లో హైబీమ్ లైట్లకు బదులు లోబీమ్ లైట్లను వినియోగించాలి.



## కాంగోలో వర్ష బీభత్సం.. 60 మంది మృతి!

కాంగోలో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి వరదలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల ఇల్లు, రోడ్లు ధ్వంసం అయ్యాయి. కొండచరియలు విరిగిపడి 20 మంది మరణించారు. దీంతో కాంగోలోని సౌత్ కివు ప్రాంతంలో వరదలు, కొండచరియల వల్ల మరణించిన వారి సంఖ్య 60కి పెరిగింది. వరదల్లో చిక్కుకున్న గ్రామాల్లో సహాయక చర్యలు చేపడుతున్నట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది.

## భారత్‌లో పెరిగిన ఆహార ద్రవ్యోల్బణం.. రంగంలోకి దిగిన ప్రభుత్వం

దేశంలో అధిక ఆహార ద్రవ్యోల్బణంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన ఆరు నెలల ఆర్థిక సమీక్షలో దేశంలో ఆహార ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత కాలంలో ప్రపంచవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రధాన ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతోందని, అయితే భారత్‌తో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, దక్షిణాఫ్రికా, జపాన్ వంటి దేశాల్లో ఆహార ద్రవ్యోల్బణం ఎక్కువగానే ఉందని నివేదిక పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ అంచనా వేసిన 6.5 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తన నివేదికలో పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక విభాగం 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలల ఆర్థిక సమీక్ష నివేదికను విడుదల చేసింది. నివేదిక ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం రేటు 2022-23 మొదటి అర్థ భాగంలో 7.2 శాతంతో పోలిస్తే 5.5 శాతానికి తగ్గింది, ఇందులో ప్రధాన ద్రవ్యోల్బణం అంటే ఆహారేతర వస్తువుల తగ్గుదల ప్రధాన కారణం. కానీ 2023-24 ప్రథమార్థంలో ఆహార ద్రవ్యోల్బణంలో హెచ్చుతగ్గులు ఉన్నాయి. అసమాన వాతావరణం కారణంగా సరఫరా గొలుసు సమస్యల కారణంగా.. జూలై, ఆగస్టులలో కొన్ని




ఆహార పదార్థాల ధరలలో పెరుగుదల ఉంది. కానీ ప్రభుత్వం జోక్యం చేసుకుని దానిని నియంత్రించడంలో విజయం సాధించింది. ప్రభుత్వం ఉల్లిని కిలో రూ.25కే వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చిందని నివేదిక పేర్కొంది. మార్చి 31, 2024 వరకు ఉల్లిపాయల ఎగుమతి నిషేధించబడింది. పప్పు ధాన్యాల ద్రవ్యోల్బణం నుంచి ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం భారత పప్పులను చౌక ధరకు విక్రయిస్తోంది. కిలో పప్పు కిలో రూ.60కి విక్రయిస్తున్నారు. బాస్మతీయేతర బియ్యం ఎగుమతిపై నిషేధం విధించగా, బాస్మతీయేతర తెల్ల బియ్యంపై 20 శాతం ఎగుమతి సుంకం విధించారు. నిల్వలను నియంత్రించడానికి ప్రభుత్వం గోధుమలపై స్టాక్ పరిమితిని నిర్ణయించింది. దీంతో ప్రభుత్వం భారత్ పిండిని కిలో రూ.27కు విక్రయిస్తోంది. చక్కెర ధరల పెరుగుదలను అరికట్టేందుకు ప్రభుత్వం చక్కెర ఎగుమతిని నిషేధించిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తన నివేదికలో పేర్కొంది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ మొత్తాన్ని రూ.200 నుంచి రూ.400కి పెంచారు.




## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం.. ఐదుగురు మృతి

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపుతప్పి ఓ ట్రక్కు టీ షాపులోకి దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన డిసెంబర్ 30వ తేదీ శనివారం తెల్లవారుజామున పుదుక్కోట్టై జిల్లాలో తిరుచ్చి - రామేశ్వరం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుచ్చి - రామేశ్వరం హైవేపై వేగంగా దూసుకొచ్చిన ఓ ట్రక్కు.. అదుపుతప్పి రోడ్డు ప్రక్కనున్న టీ షాపులోకి దూసుకెళ్లింది. టీషాపు ముందు పార్క్ చేసి ఉన్న వాహనాలను ఢీకొట్టుకుంటూ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ఐదుగురు మృతి చెందగా.. మరో 19మంది గాయపడ్డారు. మరణించినవారిలో ఒక మహిళ కూడా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

## భార్యకు వీడియో కాల్ చేసి.. లైవ్‌లో భర్త ఆత్మహత్య

భార్యకు వీడియో కాల్ చేసి లైవ్‌లో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి జిల్లా పెద్ద కందుకూరుకు చెందిన ముత్తడి నరేష్(28) ఉప్పల్‌లోని సరస్వతి కాలనీలో భార్య నిత్యశ్రీతో కలిసి ఉంటున్నారు. మెట్రో రైలు సిగ్నలింగ్ విభాగంలో ఉద్యోగి. ఏడాది క్రితమే వీరికి వివాహమైంది. భార్యది ఇదే జిల్లా అమ్మనబోలు గ్రామం. ఆమె గర్భిణి కావడంతో వారం క్రితం సీమంతం కోసం పుట్టింటికి వెళ్లింది. ఆ రోజు నుంచి సీమంతానికి బంధువులను పిలిచే విషయంలో ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు... ఇదే క్రమంలో ఆస్తి తగాదాలు తలెత్తాయి. మనస్తాపానికి గురైన నరేష్ శుక్రవారం భార్యకు వీడియో కాల్ చేశాడు. అప్పటికే ఫ్యాన్‌కు చీరను కట్టి ఉన్నాడు. భార్య చూస్తుండగానే ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## వలంటీర్లకు అదనంగా రూ.750

గ్రామ, వార్డు వలంటీర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రతి నెలా గౌరవ వేతనంగా చెల్లిస్తున్న రూ.5,000కు అదనంగా మరో రూ.750ను ప్రోత్సాహకంగా చెల్లించనున్నట్లు సర్కార్ వెల్లడించింది. ఈ రూ.750ను పౌరసరఫరాల శాఖ ద్వారా వేరేగా వలంటీర్లకు అందించనున్నట్లు తెలిపింది. ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమంలో వలంటీర్లు క్రియాశీలకంగా పాల్గొంటున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.



## "బాలయ్య 109" లో జాయిన్ అయ్యిన పవర్ఫుల్ విలన్.!

ప్రస్తుతం నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా టాలెంటెడ్ దర్శకుడు కొల్లి బాబీ దర్శకత్వంలో చేస్తున్న మాసివ్ యాక్షన్ సబ్జెక్టు కోసం అందరికీ తెలిసిందే. ఆల్రెడీ బాలయ్య హ్యాట్రిక్ విజయాలు అందుకోవడం తన కెరీర్ 109వ సినిమాని వాటిని మించి పవర్ఫుల్ గా అనౌన్స్ చేయడంతో అయితే బాలయ్య నెక్స్ట్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ విలన్ గా కనిపిస్తాడు అనే వార్తలు కూడా వచ్చాయి. దానిని తాను కన్ఫర్మ్ చేయగా "అనిమల్" సినిమా చూసాక ఈ క్రేజీ కాంబినేషన్ పై మరిన్ని అంచనాలు స్టార్ట్ అయ్యాయి. అయితే ఫైనల్ గా ఈ చిత్రంలో బాబీ డియోల్ లేటెస్ట్ గా జాయిన్ అయ్యినట్టుగా తెలుస్తుంది. దీనిపై లేటెస్ట్ గా కొన్ని పిక్స్ కూడా వైరల్ గా మారాయి. మరి ఈ క్రేజీ ఫేస్ ఆఫ్ ఏ లెవెల్లో ఉంటుందో వేచి చూడాలి. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



## బికినీలో ప్రగ్యా జైస్వాల్

[redacted] చెప్పాలి. ఈ భామ చేతిలో సినిమాలు లేవు. కానీ సోషల్ మీడియాలో తెగ యాక్టివ్ గా ఉంటుంది. అందచందాలను ఆరబోస్తూ.. నేను సినిమాలకు రెడీ అంటూ దర్శక నిర్మా [redacted] సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ని అలరిస్తుంది.బికినీలో ప్రగ్యా కనబడటంతో ఇది కదా అసలైన న్యూఇయర్ ట్రీట్ అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.